క్లుప్తంగా

మూసీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేరేడుచర్ల : మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేరేడుచర్ల తహసీల్దార్ సురగి సైదులు అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేతేపల్లి వద్ద మూసీ ప్రాజెక్టు నుంచి రెండు గేట్లు ఎత్తి దిగువకు 1260 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. మూసీ నదిలో వరద ఉధృత్తి ఎక్కువగా ఉన్నందున మండలంలోని సోమారం, యల్లారం, పులగంబండతండా, రోళ్లవారిగూడెం, చిల్లేపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేపల వేట కోసం ఎవరు కూడా మూసీలోకి దిగకూడదని, సమీప ప్రాంత రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎద్దైన ప్రమాదం సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని వినతి

నడిగూడెం : అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ కోరారు. ఈమేరకు శుక్రవారం నడిగూడెం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా పెన్షన్ల కోసం అనేక మంది అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వికలాంగులకు ఆరు వేలు, గీత కార్మికులకు ఐదు వేల రూపాయల చొప్పున పెన్షన్లు ఇవ్వాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న డాక్టర్ హరినాథ్

నడిగూడెం : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నడిగూడెం పల్లెదవాఖాన వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. నీటి నిల్వలను తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు సైదమ్మ, లక్ష్మి, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

గరిడేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి చత్రునాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడెం, రంగాపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 15 వరకు విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్. లక్ష్మయ్య, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు సీహెచ్ రాజశేఖర్, సీఆర్పీ రాతికింది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్టులు, ఐడీకార్డులు అందజేత


టై, బెల్టులు, ఐడీకార్డులతో విద్యార్థులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని వెంకట్రాంపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు పిట్ట వీరస్వామి రూ.3 వేలు విలువ గల టై, బెల్టులు, ఐడీకార్డులను శుక్రవారం తన సొంత ఖర్చుతో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంను గ్రామస్తులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చిలుకూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గురువారం అర్ధరాత్రి చిలుకూరులో పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనాథాశ్రమంలో అన్నదానం

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు బాల సైదులు తన కూతురు వసుంధర జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక అనాథ ఆశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ నగేష్ రాథోడ్, దొడ్డ నర్సింహారావు, ముల్కలపల్లి రాంబాబు, కె.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు, హన్ను, సాయి, రాము, దన్పాల్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. వానొస్తే చింత


కోదాడ- జడ్చర్ల హైవేపై జానకీనగర్ స్టేజీ నుంచి జానకీనగర్ వెళ్లే రోడ్డు


చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డు ఇలా..

- అధ్వానంగా లింకు రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీ రోడ్లు మంజూరు చేయాలని వేడుకోలు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై అడుగుకో గుంత ఏర్పడింది. గుంతల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా చిలుకూరు మండలంలోని కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై జానకీనగర్ స్టేజీ నుంచి జానకీనగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. అదేవిధంగా చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డు, సీతారాంపురం నుంచి నారాయణపురం వెళ్లే రోడ్డు, చిలుకూరు నుంచి రామాపురం వెళ్లే రోడ్డు, పాత చిలుకూరు నుంచి చెరువు కట్ట మీదుగా ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారాయి. అలాగే బేతవోలు నుంచి చెన్నారిగూడెం మీదుగా ఆచార్యులగూడెం వెళ్లే రోడ్డు, జెర్రిపోతులగూడెం నుంచి హుజూర్‌నగర్ మండలానికి వెళ్లే రహదారులు కూడా అధ్వానంగా మారాయి. దీంతో రైతులు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుత వర్షాకాలంలో చిత్తడిగా మారిన ఈ రోడ్లపై నడిచి వెళ్లే పరిస్థితి లేదు. వాహనాలు కూడా అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. సాగు సీజన్ ప్రారంభం కావడంతో నిత్యం ఆయా రోడ్లపై రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్లు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం



మండలంలో అధ్వానంగా ఉన్న లింకురోడ్లకు మరమ్మతులపై సంబంధిత శాఖ ఏఈతో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. రోడ్ల విషయాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తా. మండలంలో కొన్ని లింకు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. కానీ టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

– గిరిబాబు, ఎంపీడీఓ, చిలుకూరు

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మఠంపల్లి : భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూసమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రేషన్ కార్డుల దరఖాస్తులను పెండింగ్ ఉంచొద్దన్నారు. తహసీల్దార్ మంగారాథోడ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యం


పూడితతీత పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

హుజూర్‌నగర్ : వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం దద్దనాల చెరువు నుంచి వచ్చే పంటకాలువ, లింగగిరి మేజర్‌కు అనుబంధంగా ఉన్న పంట కాలువ పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కురిసిన వర్షాలు, వరదలతో ముప్పు మళ్లీ తలెత్తకుండా ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వార్డు ఆఫీసర్లు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన


రోడ్డుపై బురదలో నాట్లు వేస్తున్న అవిరేణికుంటతండా గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని అవిరేణికుంటతండా నుంచి పెదవీడు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అవిరేణికుంట తండా వాసులు రోడ్డుపై బురదలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయంగా మారి వాననీరు నిలుస్తోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొండానాయక్, వేణునాయక్, సుజాత, బుజ్జి, సోమలి, మంగమ్మ, సువాలి, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


హుజూర్‌నగర్‌లో బంగారం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : బ్యాంకులు, బంగారం దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ చరమందరాజు సూచించారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని బ్యాంకులు, బంగారం దుకాణాలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు మేనేజర్లు బ్యాంకులలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లు, లాకర్లను ఎప్పటికప్పుడు తనఖీ చేసుకోవాలన్నారు. బ్యాంకులు, బంగారు దుకాణాల్లో అలారం వచ్చే సీసీ కెమెరాలను దుకాణం లోపల పూర్తిగా, బయట వైపు రోడ్డు కూడా కనిపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, అంతేకాకుండా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి బంగారం కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఒకవేళ అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా బ్యాంకు మేనేజర్లు, బంగారం దుకాణాల యజమానులు ఉన్నారు.

విద్యార్థులకు రాజ్యాంగ పుస్తకాలు బహూకరణ


కలెక్టర్ చేతుల మీదుగా రాజ్యాంగ పుస్తకాలు అందజేస్తున్న సుమన్

మునగాల : ప్రతిఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన ఉండాలని, ఇందుకోసం తాను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా రాజ్యాంగ పుస్తకాలు అందజేస్తున్నట్లు మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాయిరాల సుమన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగం పుస్తకాలను జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్తలు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, గంధం సైదులు ఓరుగంటి రవి, దార సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు


హుజూర్‌నగర్ : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


గరిడేపల్లి : గుండాలమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణమాస తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. నీరాజన మంత్ర పుష్పం తదుపరి తీర్థప్రసాదాల వినియోగం గావించారు. ఆలయంలో కీర్తనలతో భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలువురు మహిళలు ఇళ్లలో లక్ష్మీదేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించుకొని లలిత సహస్రనామం, విష్ణుసహస్రనామం పారాయణం చేశారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, నిరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం


ఉపాధ్యాయులకు మొక్క అందజేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు లక్ష్మీనారాయణ

చిలుకూరు : పర్యావరణంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ – జీవరాసులపై వాటి ప్రభాం అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ వాడటంతో జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కైలాస వెంకటేశ్వర్లు, రాజారాం, అంకిరెడ్డి, రవికుమార్, సత్యనారాయణ, కోదండరామయ్య పాల్గొన్నారు.

విశేషంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యపూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి, గోదాదేవి, శ్రీవీరాంజనేయస్వామి వార్లకు శ్రావణ మాసం మొదటి శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యకల్యాణం జరిపి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫనిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, శ్రీనివాసరావు, సీతారామాచార్యులు, చీకూరి రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

26 నుంచి స్పాట్ అడ్మిషన్లు

సూర్యాపేట : బాలెంలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 26 నుంచి 31వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం జనరల్, ఎంపీసీ, ఎమ్మెస్ డీఎస్, ఎంజెడ్‌సీ, మిగిలిన ఎస్సీ సీట్లు భర్తీ చేయుటకు కళాశాల ప్రాంగణంలో స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయి, అర్హత కలిగిన విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్స్ తీసుకొని ఈ నెల 26 నుంచి 31వరకు కళాశాల ప్రాంగణంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. విద్యార్థినులు దోస్త్ ఐడితో పాటు 5 పాస్‌పోర్ట్ ఫొటోలు, బోనాఫైడ్, క్యాస్ట్, ఇన్‌కమ్, ఆధార్‌కార్డ్ సర్టిఫికెట్లను తీసుకరావాలని తెలిపారు. వివరాలకు సెల్ : 79950 10681, 93983 16225 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

బావి రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో గల చైతన్య స్కూల్ సమీపంలో గల బావి ప్రమాదకరంగా ఉండటంతో దానికి రక్షణ గోడ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి పర్యవేక్షించి మాట్లాడారు. బావికి రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గోడ నిర్మించాలని వార్డు ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ బావి నుంచి పట్టణంలోని ఐదు వార్డులకు మంచినీటి సరఫరా జరుగుతున్నందున పనులు వేగవంతంగా చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సిరెడ్డి, వాటర్ పైప్ లైన్ ఇన్‌చార్జ్ పిట్టల గురవయ్య, అంకిరెడ్డి వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు


నేరేడుచర్లలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు


నేరేడుచర్ల : సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నేరేడుచర్ల : భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. దరఖాస్తులు పరిశీలనలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా విధులకు హాజరు కావాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సురగి సైదులు, డీటీ మౌనిక, ఆర్ఐ నర్సయ్య ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 6వ వార్డులోని బైపాస్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మున్సిపల్ అధికారి అంజయ్య, వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష


తాడువాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష లబ్ధిదారులకు సూచించారు. మునగాల మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన తాడువాయిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని రేపాల గ్రామపంచాయతీలో నర్సరీని సందర్శించారు. వనమహోత్సవం ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సింహులగూడెంలో వనమహోత్సవం ప్లాంటేషన్, ఈత సొసైటీ భూమిని పరిశీలించి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్ర మాల్లో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీఓ నరేష్, ఏపీఓ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ ఇంటిపై దాడి

- తమ భూమి ఆక్రమించారంటూ కవిత ఇంటిపై నాయీ బ్రాహ్మణుల దాడి


భూవివాదంపై మాజీ ఎంపీపీతో మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండలో మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి గతంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని తమ భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ ఆ భూమిలో నిర్మించిన ఇంటిపై మాధవరపు లక్ష్మయ్య కుటుంబసభ్యులు శుక్రవారం దాడికి దిగారు. వివరాలు.. గ్రామంలో 452 సర్వే నంబర్‌లో 3.7 గుంటల భూమి ఉంది. ఆ భూమిలో 1.9 గుంటల భూమి తమదని గ్రామానికి చెందిన నాయీ బ్రహ్మణులు చెబుతుండగా, భూమి మొత్తం తమదేనని చింత కవితారాధారెడ్డి కుటుంబ సభ్యులు అంటున్నారు. దీనిపై గత నాలుగేళ్లుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై గత ఏడాది జనవరిలో కవితారాధారెడ్డిపై దాడి జరిగింది. 1.9 గుంటల భూమిపై తాజాగా తమకు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందంటూ లక్ష్మయ్య కుటుంబసభ్యులు.. చింత కవిత ఇంటి గేటు తాళం పగులకొట్టి ఆక్రమణకు యత్నించారు. హైకోర్టులో తమకు స్టే ఆర్డర్ ఉండగా గేటు తాళం ఎందుకు పగులగొడతారని అక్కడకు చేరుకున్న కవితారాధారెడ్డి కుటుంబ సభ్యులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇంతలో కోదాడ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ భూపంచాయతీపై కోర్టు నుంచి పూర్తిగా క్లియరెన్స్ ఆర్డర్స్ వచ్చేంత వరకు ఆ ఇంట్లో ఎవరు ఉండొద్దని చెప్పి అక్కడి నుంచి పంపించారు.

అధికార పార్టీ అండదండలతోనే దాడులు : మాజీ ఎంపీపీ కవిత

గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుల అండదండలు, ప్రోద్బలంతోనే తమ ఇంటిపై దాడులు చేస్తున్నారని మాజీ ఎంపీపీ చింతా కవితారాధారెడ్డి ఆరోపించారు. 1971 నుంచి 452 సర్వే నంబర్‌లోని 307 గుంటల భూమిపై తమ కుటుంబ సభ్యులమే హక్కుదారులుగా ఉన్నామని తెలిపారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా ఇంటిపైకి దౌర్జన్యంగా ఎలా వస్తారని ఆమె ప్రశ్నించారు. ధరణి భూ ప్రక్షాళన సమయంలో వారికి వచ్చిన 1బితో భూమి తమదని అంటున్నారని, ఆ తర్వాత రెవెన్యూ అధికారులు సర్వే చేసి లక్ష్మయ్య కుటుంబసభ్యులకు భూమి లేదని నివేదిక కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న అరిబండి ట్రస్ట్ సభ్యులు

నేరేడుచర్ల : ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.శృతి, ఎస్. గీతికను శుక్రవారం అరిబండి ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో పెంచికల్‌దిన్న మాజీ సర్పంచ్, న్యాయవాది సుంకరి క్రాంతికుమార్, సిరికొండ అనిల్‌కుమార్, జింకల భాస్కర్, రాఘవారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముమ్మరంగా సాగు పనులు


రత్నవరం వద్ద నాట్లు వేస్తున్న కూలీలు


వేణుగోపాలపురం వద్ద పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

- కొనసాగుతున్న వరినాట్లు
- మెట్ట పంటల్లో కలుపుతీత పనులు

నడిగూడెం : మండలం వ్యాప్తంగా వానాకాలం సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నాగార్జున సాగర్ ఆయకట్టు కింద గ్రామాల్లో బోర్లు, బావుల కింద, ఎడమ సాగర్ కాల్వ ఆధారంగా వరి సాగు చేపడుతున్నారు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న కొమరబండ మేజర్ కాలువ , కొత్తగూడెం మేజర్, పాలారం మేజర్ కాల్వల పరిధిలోని చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి, రత్నవరం, శ్రీరంగాపురం, వల్లాపురం, సిరిపురం గ్రామం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. కూలీల కొరతతో పాటు వెదజల్లే పద్ధతిలో ఎకరానికి 10 కిలోల విత్తనాలు సరిపోతుండడం, నారు పెంచే ఖర్చు, నాట్లు పెట్టే ఖర్చు మిగులుదుండడంతో ఈవిధానంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. పలు గ్రామాల రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. పలువురు రైతులు నారు పెంచి నాట్లు పెడుతున్నారు. మండలంలో దాదాపు పన్నెండు వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టనున్నారు. ఇప్పటికే ఆరు వందల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాదాపు వంద ఎకరాల్లో కంది, పెసర పంటలు సాగు చేపట్టారు.

మెట్ట పంటల్లో కలుపుతీత పనులు..

వర్షాలు కురుస్తుండడంతో మెట్ట పంటల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ ఆరంభం నుంచి సరైన వర్షాలు లేక రైతులు బెట్ట పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో నడిగూడెం మండలంలోని బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో సాగు చేసిన పత్తి, కంది, పెసర పంటలలో కలుపు తీసే పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మెట్ట పంటలకు రైతులు ఎరువులు వేస్తున్నారు.